సాక్షి వికారాబాద్

గురువారం ; 27 ; మార్చి ; 2025




మండే కాలం..

గ్రామాల్లో నర్సరీల నిర్వహణ అధ్వానంగా మారింది. మొక్కలకు నీటి వసతి లేక ఎండిపోతున్నాయి. 8లో▸



వెలవెలబోతున్న..

అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ వేదికలు అలంకారప్రాయంగా మారాయి. 8లో▸



న్యూస్‌రీల్

అమిత్‌షాను కలిసిన మారుతీకిరణ్



అమిత్‌షాతో మారుతీకిరణ్

పరిగి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను బుధవారం వారి అధికారిక నివాసంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో రాజకీయ పరిస్థితులపై అమిత్‌షా ఆరా తీశారని తెలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీ ఉందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని.. కావున ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని కేంద్ర మంత్రి అమిత్‌షా సూచించారని తెలిపారు.

వాహనాలకు వేలం



వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం ఆవరణలో బుధవారం 148 వాహనాలను వేలం నిర్వహించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న, గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన వాహనాలను వేలం వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేలం పాట కమిటీ చైర్మన్ ఏఎస్పీ హనుమంతరావు, ఏఓ జ్యోతిర్మని, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బస్వరాజ్ పటేల్



బస్వరాజ్ పటేల్ అధ్యక్షుడు



వెంకట్‌రెడ్డి, కార్యదర్శి

అనంతగిరి: న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నూలి బస్వరాజ్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. న్యాయవాదులందరూ బస్వరాజు పటేల్‌కు మద్దతు తెలిపి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పోలీస్ వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మోహన్ రాథోడ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పరమేష్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శుక్లవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బస్వరాజ్ పటేల్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

యూఎన్‌హెచ్‌ఆర్‌సీలో ప్రసంగించిన సాయి సంపత్



సమావేశంలో సాయిసంపత్ (మధ్యలో కోటు వేసుకున్న వ్యక్తి)

తాండూరు టౌన్: యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (యుఎన్ హెచ్ఆర్సీ)లో సమావేశంలో బషీరాబాద్ మండలం బహదూర్‌పూర్ గ్రామానికి చెందిన ఎకో ఫాన్ సొసైటీ వ్యవస్థాపకుడు మెట్టు సాయిసంపత్ పాల్గొని ప్రసంగించారు. ఈనెల 24న స్విట్జర్లాండ్ దేశం జెనీవాలోని యున్ హెచ్ఆర్సీలో ఎకోఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారత దేశంలో మానవ హక్కులు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భారత్‌లో మానవ హక్కులపై విదేశీ ఏజెన్సీల అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ వాస్తవ పరిస్థితులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ఏర్పడిన శాంతి, ఆర్థిక పునరుద్ధరణ, భద్రత, అభివృద్ధి గురించి తెలియజేశారు. కోవిడ్ సందర్భంగా భారత్ చూపిన చొరవ, స్పందన, సాంకేతిక పురోగతి, శాంతి స్థాపనను సమావేశంలో వివరించినట్లు చెప్పారు. తనతోపాటు దేశం నుంచి డాక్టర్ అరవింద్, డాక్టర్ ఎస్ఎన్ శర్మ, డాక్టర్ ఫైజా రిఫాత్, సతీష్ కుమార్, జావేద్ బేగ్ తదితరులు పాల్గొన్నట్లు సాయిసంపత్ తెలిపారు.

ఉగాదికి సన్న బువ్వ

- ఇప్పటికే గోదాంలకు చేరిన 5,603.408 మెట్రిక్ టన్నుల బియ్యం
- సన్నాలతో సర్కారుపై ప్రతినెలా రూ.5.43 కోట్ల అదనపు భారం
- పథకం పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు

ఈనెల 30న రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ

బషీరాబాద్: ఉగాది పండుగ నుంచి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయనుంది. ఇప్పటి వరకు కార్డుదారులకు దొడ్డు బియ్యం అందించాయి. రాష్ట్రంలో తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారందరికీ ఈ నెలాఖరుకు తెలంగాణ సోనా నాణ్యమైన సన్న బియ్యం అందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సివిల్ సప్లయ్ అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల వారీగా సన్నబియ్యం కోటాను గోదాంలకు తరలించారు. ఈ పథకాన్ని ఈ నెల 30న రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.

మొత్తం కార్డులు 2,63,573

జిల్లాలో కొత్తగా మంజూరైన వాటితో కలిపి 2,63,573 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి 5,603.408 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ కోటాకు సంబంధించిన బియ్యాన్ని రేషన్ దుకాణాలకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆర్ఎన్ఆర్‌తో అధిక పోషకాలు

తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్ 15048) మేలైన సన్న రకం బియ్యం. ఈ బియ్యంలో అనేక పోషక గుణాలు ఉన్నట్లు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ), ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన సర్వేలో తేలింది. ఇతర సాధారణ రకాల బియ్యంలో గ్లైసిమిక్స్ సూచిక(మధుమేహానికి దారితీసేది) 56.5 శాతం వరకూ ఉండగా, తెలంగాణ సోనాలో దీని శాతం 51.5%గా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. వీటితో పాటు విటమిన్ బీ -3, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ప్రతి వంద గ్రాముల తెలంగాణ సోనా బియ్యంలో 3 గ్రాముల పీచు పదార్థాలు (ఫైబర్), 8 గ్రాముల పోషకాలు, 0.2 గ్రాముల కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఈ బియ్యం నాణ్యతో పాటు రుచికరంగా ఉండటంతో ప్రభుత్వం ఇవే బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. మన జిల్లాలో వరి సాగు తక్కువగా ఉండటంతో పక్క జిల్లాలు మహబూబ్‌నగర్, వనపర్తి నుంచి సరఫరా చేస్తున్నారు.



ఆర్ఎన్ఆర్ సన్నబియ్యం

అక్రమ రవాణాకు చెక్

గతంలో లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. దీంతో చాలా మంది వాటిని తినేవారు కాదు. కొందరు దుకాణాల్లో విక్రయించేవారు కాగా.. మరి కొందరు రేషన్ షాపుల్లోనే ఇచ్చేసి డబ్బు తీసుకునేవారు. డీలర్లు కూడా అక్రమాలకు పాల్పడేవారు. ఇక నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో అక్రమాలు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ తోపాటు తహసీల్దార్లు రేషన్ పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.



తాండూరు మండలంలోని ఓ రేషన్ షాపులో దింపుతున్న సన్నబియ్యం బస్తాలు

అర్హులందరికీ అందిస్తాం

ఉగాది పండుగ నుంచి రేషన్‌దుకాణాల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తాం. గతంలో దొడ్డు బియ్యం అని చాలా మంది తినేవారు కాదు. త్వరలో సన్న బియ్యం పంపిణీ చేయనుండటంతో ప్రతి ఒక్కరూ తీసుకునే అవకాశం ఉంది. బ్లాక్ మార్కెట్‌కు అవకాశం ఉండదు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ

ప్రతినెలా 21.30 కోట్లు ఖర్చు

జాతీయ ఆహార భద్రత పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్నాళ్లు పేదలకు కిలోకు రూ.29 ఖర్చుతో దొడ్డు బియ్యం ఉచితంగా పంపిణీ చేశాయి. జిల్లాకు సంబంధించి 5,603.408 మెట్రిక్ టన్నులకు రూ.16.25 కోట్లు ఖర్చు చేస్తూ వచ్చాయి. ఉగాది పండుగ నుంచి కిలోకు రూ.38 ఖర్చుతో రేషన్ కార్డులో ఎంతమంది ఉంటే అందరికీ 6 కిలోల చొప్పున ఆర్ఎన్ఆర్ రకం సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయనుంది. ఇందుకోసం రూ.21.30 కోట్లు ఖర్చు చేస్తోంది. కొత్త కార్డులతో కలిపి ప్రతినెలా సర్కారు ఖజానాపై రూ.5.43 కోట్ల అదనపు భారం పడనుంది.



గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అక్రమార్కులపై కొరడా

- మైన్స్ ఏడీకి బెదిరింపు ఫోన్‌కాల్ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు, పోలీసులు
- లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

తాండూరు/తాండూరు రూరల్: మైనింగ్ శాఖ అధికారులకు బెదిరింపు ఫోన్‌కాల్స్ రావడం, దాడి చేయడం వంటి ఘటనలపై ఆ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. అక్రమార్కులపై చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద మైనింగ్ శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యకాంత్‌రెడ్డిపై దాడి చేసి గాయపరిచిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. జిల్లాలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలపై ఏడీ సత్యనారాయణ.. రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ శశాంక దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైదరాబాద్ రేంజ్ డీడీ గోవింద్‌రావు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. దాడి ఘటనలో గాయపడిన సూర్యకాంత్‌రెడ్డికి దగ్గరుండి వైద్యం చేయించారు. గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద సూర్యకాంత్‌రెడ్డిపై దాడి చేసిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకా కిష్టాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ సునీల్ జాదవ్‌పై రాయల్టీ ఎగవేత తోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ సత్యనారాయణ మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం స్వాధీనం చేసుకున్న 11 లారీలకు రూ.1,04,500 పెనాల్టీ విధించినట్లు తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం: మైన్స్ ఏడీ సత్యనారాయణకు ఉన్నతాధికారుల మద్దతు

సాక్షి ఎఫెక్ట్..

మైనింగ్ అక్రమార్కుల బెదిరింపులకు అధైర్య పడరాదని. తాము అండగా ఉంటామని మైన్స్ ఏడీ సత్యనారాయణకు ఉన్నతాధికారులు భరోసా ఇచ్చారు. లారీలు వదిలేస్తావా.. లేపేయ మంటావా అనే శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన వార్త తాండూరులో కలకలం రేగింది. మైన్స్ ఏడీకి బెదిరింపు ఫోన్ కాల్స్ రావడంపై పలువురు స్పందించారు. మైనింగ్ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెదిరింపు ఫోన్ కాల్స్‌పై ఇంటలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల ఆరా తీసినట్లు తెలిసింది. నిజాన్ని నిర్భయంగా రాసిన సాక్షి దినపత్రికకు మైనింగ్ ఏడీ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి వార్తలు రాయడం వలన అక్రమార్కులు భయపడతారని అన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

లక్ష టన్నుల సేకరణే లక్ష్యం

- జిల్లాలో ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు
- 128 కేంద్రాల ద్వారా సేకరిస్తాం
- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి లక్ష టన్నుల వరి ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు, కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణ, కేంద్రాల్లో వసతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తేమ లేకుండా.. నాణ్యమైన ధాన్యం తేవాలని రైతులకు సూచించారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి కేంద్రం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ధరలు, తేమ శాతం ఏ మేర ఉండాలి అనే వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. ప్యాడి క్లీనింగ్ యంత్రం, తేమ శాతం కొలిచే పరికరాలు, తాగునీటి వసతి ఉండేలా చూసుకోవాలన్నారు. అవసరం మేరకు గన్నీ బ్యాగులు ఉండాలన్నారు. ఏఈఓల నుంచి టోకెన్లు తీసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తేవాలని రైతులకు సూచించారు. జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. టార్పాలిన్లు, తూకం మిషన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లై సిబ్బందిని ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల నుంచి బియ్యం రాకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు లారీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, డీఎం సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి, ఆర్‌టీఏ వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- అడిషనల్ కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

మర్పల్లి: ఈ నెల చివరి నాటికి వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, ఉపాధి కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మర్పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సాయంత్రం ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య అధ్యక్షతన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నుల వసూలు నిర్లక్ష్యం చేయరాదని ఆదేశించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్లు పగిలిపోతే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, సూపరింటెండెంట్ కృష్ణారావు, ఈఓ పీఆర్‌డీ లక్ష్మీకాంత్, ఏఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్, ఏపీఎం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నీటిని తరలిస్తున్నా సీఎం పట్టించుకోవడం లేదు

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు కరువొచ్చింది
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు కావడంతో శ్రీశైలం జలాశయం నీటిని ఆంధ్రాకు తరలించుకుపోతున్నా ఏమీ అనలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కొడంగల్‌లో మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఆంధ్రాకు నీళ్లు తరలిస్తున్న కాంగ్రెస్ తెలంగాణకు కరువు తెచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తిచేయకపోవడంతో తాగు, సాగునీటి కష్టాలు వస్తున్నాయని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాగు, సాగునీటికి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడలేదని స్పష్టంచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6గ్యారెంటీలు అంతంత మాత్రంగానే అమలుచేస్తున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. రైతు భరోసా, రుణమాఫీ కోసం కర్షకులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎండిన పంటలకు, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగాది పండగలోపు అందరికీ రైతు భరోసా అందించాలని, రుణమాఫీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్న సీఎం తన నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, భూముల అక్రమ దందాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాము కేసులు పెడితే పోలీసులు తీసుకోవడంలేదని, తాము పెట్టిన కేసులపై చర్యలు లేవని, ప్రశ్నిస్తే అక్రమ కేసులను బనాయిస్తున్నారని మండిపడ్డారు. దౌల్తాబాద్‌లో పెట్టిన అక్రమ కేసులను వెంటనే విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు పండగలకు ముందుగానే సంబరాలు జరుపుకునేవారన్నారు. ప్రస్తుతం రంజాన్ పండగకు నాలుగు రోజులే ఉన్నా నిరుపేద ముస్లింలకు దుస్తులు, ఇఫ్తార్ విందుల మాటే ఎత్తడంలేదని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు మధుసూదన్ యాదవ్, రమేష్‌బాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల యాదగిరి, మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నర్మదా కిష్టప్ప, డాక్టర్ నవాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధానాచార్యులు

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

– కొడంగల్ రూరల్



విశేష అలంకరణలో శ్రీవారు

క్లుప్తంగా

పాస్టర్ ప్రవీణ్ మృతి బాధాకరం

టీయూసీపీఏ జిల్లా ఇన్‌చార్జి పాస్టర్ అశోక్

తాండూరు టౌన్: ఏపీలోని రాజమండ్రి సమీపంలో అనుమానాస్పద స్థితిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందడం బాధాకరమని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్(టీయూసీపీఏ) జిల్లా ఇన్‌చార్జి పాస్టర్ అశోక్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవునికి నిర్భయమైన సేవకుడిగా అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ప్రవీణ్ పగడాల మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు. అయితే ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చెబుతున్నప్పటికీ, అందులో ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


మహిపాల్‌రెడ్డి

బంట్వారం: చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యాచారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సూడే మహిపాల్‌రెడ్డి(35) వ్యవసాయం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి మద్యం మత్తులో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం బడికి వెళ్లిన విద్యార్థులు గమనించి గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం జరిపించినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నారు.

భార్య కాపురానికి రాలేదని..

మనస్తాపంలో వ్యక్తి ఆత్మహత్య

పూడూరు: భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నిజాంపేట్‌మేడిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర రాకేష్(33), సరిత దంపతులు. గత నెలలో తన తల్లి చనిపోవడంతో సరిత దోమ మండలం కిష్టాపూర్‌కు వెళ్లింది. అప్పటినుంచి అక్కడే ఉంది. ఇంటికి రావాలని రాకేష్ కోరినా ఆమె రాలేదు. రోజులు గడుస్తున్నా రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాకేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఇస్తారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిలింసిటీలో పేదలకు భూములివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: రామోజీ ఫిలింసిటీలో పేదలకు కేటాయించిన భూములను వెంటనే వారికి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 189, 203లలోని భూమిలో గతంలో ప్రభుత్వం 577 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిందని.. ఈ భూములను రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం కబ్జా చేసిందని ఆరోపించారు. పేదలకు మరో చోట భూములు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. పేదలకు తమకు కేటాయించిన భూముల వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకుని లాఠీ చార్జ్ చేయడం తగదన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి యాదయ్య, పలువురు నాయకులను పోలీసులు గాయపరిచి అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మండే కాలం.. నర్సరీలు భద్రం

- గ్రామాల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం
- నిధులలేమితో జంకుతున్న కార్యదర్శులు
- విత్తనాలు నాడటం,గ్రీన్ షెడ్ ఏర్పాటులో అలసత్వం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


కుస్మసముద్రం-గోరిగడ్డతండా పరిధిలో అడవిలో పడవేసిన నర్సరీ బ్యాగ్‌లు

కుల్కచర్ల: మండే ఎండలకు గ్రామాల్లో నర్సరీల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. మొక్కలకు నీటి వసతి లేకపోవడంతో మోడుబారి పోతున్నాయి. కుల్కచర్ల మండలంలో 44 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 4.40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు ఒక్కో గ్రామ పంచాయతీలో 10 వేల చొప్పున నర్సరీలలో మొక్కలు పెంచాల్సి ఉంటుంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు జిల్లా అధికారులు సమావేశాలలో స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్న పరిస్థితులు దాపురించాయి. స్థానికంగా ప్రజాప్రతినిధులు లేకపోవడంతో కార్యదర్శులు, ఉపాధి సిబ్బందే నర్సరీల నిర్వహణ బాధ్యత చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎండలకు మొలవని మొక్కలు

నర్సరీల నిర్వహణలో అధికారులు అలసత్వం వహించడంతో మొక్కల పెరుగుదల ఆరంభంలోనే ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం నారు పోయగా.. అది ఎండ వేడికి తట్టుకోలేకపోతుంది. నీరు సరిగ్గా లేకపోవడం, షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో విత్తనాలు మొలకెత్తని దుస్థితి దాపురించింది. మండల పరిధిలోని నర్సరీలలో 50శాతం విత్తనాలు మొలకెత్తని స్థితిలో ఉన్నాయి. గోరిగడ్డతండా, పీరంపల్లి, బోట్యానాయక్ తండా, బండవెల్కిచర్ల, చౌడాపూర్, నవాబుపేటలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ షేడ్ నెట్ ఏర్పాటు చేయకపోవడంతో మొక్కలకు ఎండ తీవ్రత తగిలి మాడిపోతున్నాయి.


షేడ్‌నెట్ లేని గోరిగడ్డ తండా జీపీ నర్సరీ

నిధుల లేమితో పరేషాన్!

గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు, వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం ఆర్థిక వనరులు అవసరమున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు ఏడాదిగా ఇబ్బందికి గురవుతున్నారు. అన్నీ తామే భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి దృష్ట్యా గ్రామపంచాయతీ నిర్వహణ, పాడైన బోర్లకు మరమ్మతులు చేయించడానికి కార్యదర్శులే డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. మరోవైపు నర్సరీల నిర్వహణ, కూలీలకు డబ్బులు ఇవ్వాలన్నా, షేడ్‌నెట్, కంచె, తదితర సామగ్రి అవసరమున్న నేపథ్యంలో ఆర్థికంగా మరింత ఇబ్బందికి గురవుతున్నామని కార్యదర్శులు కొంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బిల్లులు పెట్టినా ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందోనని మదన పడుతున్నారు.

పర్యవేక్షణ చేస్తున్నాం



నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం. ప్రతి గ్రామంలో 10వేల మొక్కలు పెంచాలని జిల్లా అధికారుల ఆదేశానుసారంగా పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో మినహా అన్నింటిలో నర్సరీలో విత్తనాలు పెట్టారు. షేడ్‌నెట్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది నర్సరీలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించి మొక్కల పెంపకంలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి.

– రామకృష్ణ, ఎంపీడీఓ, కుల్కచర్ల

కరన్‌కోట్‌లో రేషన్ దుకాణం

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..


అసెంబ్లీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/తాండూరురూరల్: మేజర్ గ్రామాల్లో అదనంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'కరన్‌కోట్‌లో రేషన్ పరేషాన్' కథనానికి అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బుధవారం స్పందించారు. ఆయన సభలో ప్రసంగిస్తూ.. 'కరన్‌కోట్‌లో గ్రామంలో 10 వేల మంది జనాభా ఉంది. 2137 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇంత పెద్ద గ్రామంలో ఒకే రేషన్ దుకాణం ఉండటంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు'. అని పేర్కొన్నారు. దీనికి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ స్పందిస్తూ.. నివేదిక ఇస్తే త్వరలో కరన్‌కోట్‌లో నూతనంగా రేషన్ దుకాణం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతోనే ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్లు విస్తరించండి

వికారాబాద్ జిల్లాలో కొత్తగా జాతీయ రహదారులను విస్తరించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శాసనసభలో ప్రస్తావించారు. ఆయనకు సభలో రెండుసార్లు మాట్లాడే అవకాశం వచ్చింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో బైపాస్ పాస్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. తాండూరు బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే పట్టణ ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. మరోవైపు మహబూబ్‌నగర్- చించోళి జాతీయ రహదారి పనులు నత్తనడకన జరుగుతున్నాయన్నారు. మన్నెగూడ నుంచి తాండూరుకు, తాండూరు నుంచి జహీరాబాద్ వరకు జాతీయ రహదారిని అనుసంధానం చేయాలంటూ సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల అమలుపై మాట్లాడారు.

ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి

కొందుర్గు: ట్రాక్టర్ బోల్తా పడటంతో కూలీ మృతి చెందిన సంఘటన జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన సంతన్‌పోరియా(40) దేవకి దంపతులు కొంత కాలం క్రితం ఉపాధికోసం జిల్లేడ్‌చౌదరిగూడ మండలానికి వచ్చారు. జాకారంలో ఇటుకల బట్టీ వద్ద పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఇటుకలను ట్రాక్టర్‌లో లోడు చేసుకొని ఎల్కగూడకు వెళుతుండగా చెన్నరెడ్డిగూడ వద్దకు రాగానే బోల్తా పడింది. ట్రాలీలో కూర్చున్న సంతన్‌పోరియాపై ఇటుకలు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దేవకి ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

దివ్యాంగులకు ప్రత్యేక చట్టం తేవాలి


సంతకాల సేకరణలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్ తదితరులు

కొడంగల్ రూరల్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టం చేయాలని సంతకాల సేకరణ చేపట్టారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్, డివిజన్ కార్యదర్శి ఎస్.మారుతి, జిల్లా మహిళా కన్వీనర్ సావిత్రమ్మ బుధవారం పట్టణంలోని బస్టాండ్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సంతకాలు సేకరించి మాట్లాడారు. మార్చి 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ సభ్యులు యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలు అడ్డుకోవద్దు

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లను అధికారులు అడ్డుకుంటే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని తుంకల్‌గడ్డలో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోరాదని బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. కానీ ఆర్థిక స్థోమత లేని చాలా మంది ఇళ్లను నిర్మించుకోలేరన్నారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటే అధికారులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. పరిగి తహసీల్దార్ నిర్మాణాలు అక్రమమని అడ్డుకుంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనుమతులు ఇవ్వొద్దని చెప్పడం సరికాదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు ఇస్తే, ఇప్పుడు అడ్డుకోవడం ఏంటని దుయ్యబట్టారు. పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే పేదల ఇళ్లకు పర్మిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, చంద్రమౌళి, అశోక్, నర్సింహులు పాల్గొన్నారు.

చెరువులో నీటిని కాపాడుకుందాం

వాటర్ ఎయిడ్ ఇండియా కమ్యూనిటీ వర్క్ అధికారి రేవతి


నక్కలపల్లి చెరువులో బోరును ప్రారంభిస్తున్న అధికారి రేవతి, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: చెరువులు, కుంటల్లో నీరు ఎండిపోయినప్పుడు నీటిని బయటకు తీసి చెరువులు, కుంటలు నింపడంతో మూగజీవాలతో పాటు చుట్టుపక్కల బోరు బావులకు ఉపయోగపడతాయని వాటర్ ఎయిడ్ ఇండియా కమ్యూనిటీ వర్క్ అధికారి రేవతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో చెరువు కట్ట సమీపంలో ఇన్‌జక్షన్ వెల్(వాటర్ రిచార్జీ స్ట్రక్చర్) నిర్మించడానికి బోరు వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వాటర్ ఎయిడ్ ఇండియా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధికారి రేవతి మాట్లాడుతూ.. దేశంలో చెరువులు, కుంటలు ఎండిపోకుండా చూడడానికి వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్‌జక్షన్ వెల్ కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా నక్కలపల్లి గ్రామంలో చెరువు కట్ట సమీపంలో బోరు వేయించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, నాయకులు అంజయ్యగౌడ్, రవీందర్, జీవన్, సత్తయ్య, నరేందర్, పండారయ్య తదితరులు ఉన్నారు.

వెలవెలబోతున్న రైతు వేదికలు

- కర్షకులకు అందని సలహాలు, సూచనలు
- అరకొర సౌకర్యాలతో నానా అవస్థలు
- పట్టించుకోని అధికారులు



శివారెడ్డిపల్లి రైతు వేదిక

దోమ: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వ్యవసాయశాఖ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే గతంలో రైతు వేదికలు నిర్మించారు. వీటిల్లో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించడం, సలహాలు సూచనలు అందించాలి. గత ప్రభుత్వం ఐదు వేల ఎకరాలకు ఓ రైతు వేదికను రూ.22 లక్షలతో నిర్మించి వాటిని క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. అందులో ఓ ఏఈఓను నియమించి రైతులకు సూచనలు అందించాలని సూచించింది. కానీ ఏఈఓలు మాత్రం పంట వివరాల సేకరణకే పరిమితం అవుతున్నారు. దీంతో రైతులకు పంటల సాగులో మెలకువలు అర్థం కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

ఐదు రైతు వేదికలు

దోమ మండల వ్యాప్తంగా ఐదు రైతు వేదికలను నిర్మించారు. దోమతో పాటు శివారెడ్డిపల్లి, మోత్కూర్, బ్రాహ్మణపల్లి, దాదాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో సుమారు 19,786 మంది కర్షకులకు దాదాపు 29,870 ఎకరాలలో సాగు భూములు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏఈఓల ద్వారా సలహాలు, సూచనలు అందించినప్పటికీ ప్రస్తుతం రైతులకు ఎలాంటి సమావేశాలు నిర్వహించడం లేదు.

కనీస సౌకర్యాలు కరువు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు వేదికలను నిర్మిస్తే వాటిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగడానికి గుక్కెడు మంచి నీరు లేని పరిస్థితి నెలకొంది. చాలా చోట్ల మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నీరు సక్రమంగా రాకపోవడం లేదు. రైతు వేదికల్లో స్వీపర్లు లేకపోవడంతో దుమ్ము ధూళితో దర్శనమిస్తున్నాయి. ఏఈఓలే సొంత నిధులతో శుభ్ర పరుస్తున్నారు. మహిళా ఏఈఓలకు రైతు వేదికల్లో మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అప్పటి ప్రభుత్వం హడావుడిగా నిర్మాణాలు పూర్తి చేసి అరకొర సౌకర్యాలు కల్పించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రతి రైతు వేదికలలో సౌకర్యాల కల్పనకు కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

నష్టపోతున్నాం



ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా సాగు చేసిన పంటలపై దిగుబడి ప్రభావం పడుతుంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే సలహాలు అందడం లేదు. ఏ పంటలు వేస్తే బాగుంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించాలి.

– మాన్యనాయక్, రైతు, బొంపల్లితండా

అధికారులు మరిచారు



రైతులకు సలహాలు ఇవ్వడం వ్యవసాయ అధికారులు మరిచారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కేవలం పంట నమోదుకు ఏఈఓలు పరిమితమయ్యారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. గత ప్రభుత్వం రైతులకు సమావేశాలు నిర్వహించి సూచనలు ఇచ్చింది. ప్రస్తుత సర్కారులో అది లోపించింది.

– మల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ, దోమ

చర్యలు తీసుకుంటాం



రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఏఈఓలు క్షేత్రస్థాయిలో పంట నమోదులో బీజీ అయ్యారు. డిజిటల్ క్రాప్ సర్వేతో పాటు క్రాప్ బుకింగ్ జరుగుతుంది. త్వరలో రైతులకు సమావేశాలను నిర్వహించి పంటల సాగుపై అవగాహన కల్పించేలా కృషి చేస్తాం.

– ప్రభాకర్‌రావు, వ్యవసాయ అధికారి, దోమ

ప్లాట్లను ధ్వంసం చేశారని ఫిర్యాదు

తుర్కయంజాల్: పొలంలోకి కొందరు వ్యక్తులు ప్రవేశించి ప్రహరీని, పక్కన ఉన్న ప్లాట్ల కడీలను ధ్వంసం చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 240లోని పట్టా పొలంతో పాటు, పక్కనున్న ప్లాట్లలోకి బుధవారం ఉవంద మందికి పైగా వ్యక్తులు ప్రవేశించారు. జేసీబీలతో ప్రహరీ, కడీలను ధ్వంసం చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చేరుకుని చెదరగొట్టారు.

ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోరు?

ధారూరు: స్టేషన్ ధారూరు సమీపంలోని చార్లీ టెక్స్‌టైల్ ప్రింటింగ్ ప్రైవేటు ఇండియా కంపెనీ పంచాయతీకి పన్నులు సక్రమంగా చెల్లించడం లేదని బుధవారం గ్రామస్తులు ఆరోపించారు. 2010 నుంచి కొనసాగుతున్న ఈ కంపెనీ వృత్తి వ్యాపార లైసెన్సు తీసుకోలేదని విమర్శించారు. సాధారణ ప్రజలు ఇంటి పన్ను కట్టకపోతే అనేక రకాల వేధింపులకు గురిచేసే ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. కంపెనీకి సంబంధించి 2023 నుంచి 2025 వరకు రూ.1.48 లక్షల ట్యాక్సు చెల్లించాల్సి ఉందని, వృత్తి వ్యాపార లైసెన్సు కింద ఏటా రూ.35 వేల చొప్పున చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా సదరు కంపెనీ బుధవారం ఎంపీఓకు రూ.1,02,725 చెల్లించిందని, వృత్తి లైసెన్స్ కింద రూ.14 వేలు కట్టిందని ఎంపీడీఓ నర్సింలు తెలిపారు. మిగిలిన డబ్బులను సైతం వసూలు చేయిస్తామని చెప్పారు.

రైతు ఖాతాల్లోకి 'భరోసా'

రూ.170.87 కోట్లు జమ చేసిన ప్రభుత్వం



బషీరాబాద్: 'రైతు భరోసా' సాయం కొనసాగుతుంది. ఈ నెలాఖరు వరకు రైతులందరీ ఖాతాల్లో భరోసా నిధులు వేస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా నిధులు విడుదల చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా ఇవ్వలేదు. ఫిబ్రవరి నుంచి యాసంగి పంటకు ఎకరాకు రూ.6 వేల చొప్పున సాయం అందిస్తుంది. జిల్లాలో 2,75,513 రైతులు భరోసా సాయానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. ఈ నెల 26 నాటికి 2,03,938 రైతులకు గాను రూ.1,70,87,52,650 భరోసా నిధులను వారి ఖాతాల్లో జమచేశారు. ఈ రైతులకు సంబంధించి 2,84,792 ఎకరాల భూమికి సాయం అందినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి.

31 వరకు ఎదురుచూపులు

మరో 71,575 మంది పెద్ద రైతులకు రూ.194.26 కోట్ల భరోసా నిధులు అందించాల్సి ఉంది. వీరిలో 1273 మంది రైతులకు సంబంధించి ఖాతాల డీబీటీ ఫేయిల్ అయినట్లు అధికారులు చెబుతున్నారు. వీరి ఖాతాలు కూడా సరిచేసి వారికి రావాల్సిన రూ.1.45 కోట్ల భరోసా నిధులు అందిస్తామని హామీ ఇస్తున్నారు. ఈ నెల చివరికి మిగిలిన రైతులకు భరోసా అందించి యాసంగి పెట్టుబడి సాయాన్ని పూర్తి చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. దీంతో జిల్లాలో మిగిలిన రైతులు ఈ నెల 31వరకు ఎదురుచూడక తప్పదు.

జిల్లాలో రైతు భరోసా వివరాలు

నియోజకవర్గం	రైతులు	అందిన 'భరోసా'
కొడంగల్	40,963	రూ.37.34 కోట్లు
పరిగి	52,493	రూ.42.48 కోట్లు
తాండూరు	37,675	రూ.31.10 కోట్లు
వికారాబాద్	72,807	రూ.58.28 కోట్లు
మొత్తం	2,03,938	రూ.170.87 కోట్లు

జిల్లాలో అర్హులైన రైతులు	2,75,513
ఖాతాల్లో నిధుల జమ అయిన వారు	2,03,938
భరోసా కోసం ఎదురు చూస్తున్న వారు	71,575

నిందితులను శిక్షించాలి


కోర్టు ఎదుట ఇజ్రాయెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్

మహేశ్వరం: న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయెల్ హత్య కేసుకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసి సత్వర న్యాయం చేయాలని మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఇజ్రాయెల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో న్యాయం కోసం కోట్లాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహేశ్వరం కోర్టులో పని చేస్తున్న సీనియర్ న్యాయవాది ఇజ్రాయెల్‌ను చంపాపేట్‌లో కత్తితో హత్య చేశారు. ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.